వన్య ప్రాణులకు ఆసరా!



- ఎన్‌హెచ్ 61 కింద నుంచి జంతువుల సంచారం
- ఏడు చోట్ల యానిమల్ అండర్ పాస్‌ల నిర్మాణాలు
- ఖానాపూర్ ప్రధాన రోడ్డుపై అధికారుల దృష్టి
- రూ. 61 కోట్లతో కొనసాగుతున్న పనులు
- పెరిగిన హైవే ఎస్టిమేషన్
- మరో రెండు నెలల్లో పూర్తయ్యే అవకాశం

నిర్మల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోబోతుంది. ఈ అభయారణ్యంలో అనేక రకాల వన్య ప్రాణులు నివసిస్తున్నాయి. రోజురోజుకూ వీటి జనాభా పెరిగిపోతోంది. గత కొంతకాలం క్రితం వరకు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని వన్య ప్రాణులు మరణించేవి. అయితే ఇటీవల కవ్వాల్ అభయారణ్యం గుండా నేషనల్ హైవే నెంబర్ 61 రహదారి మార్గం పనులు పూర్తవడంతో ఈ మార్గం గుండా పెద్దసంఖ్యలో భారీ వాహనాలు తిరుగుతున్నాయి. అభయారణ్యం మధ్య నుంచి ఈ హైవే కొనసాగుతూ ఉండడంతో రోడ్డు రెండు వైపులా విడిపోయింది. దీని కారణంగా అడవిలోని వన్యప్రాణులు ఈ హైవే రోడ్డును దాటుతూ సంచరించాల్సి వస్తుంది. ఇలా సంచరించే సమయంలో వన్యప్రాణులు రోడ్డుపై తిరిగే వాహనాలను ఢీకొని మరణిస్తున్నాయి. ఇప్పటికే ఇలాంటి సంఘటనలు అనేకంగా జరిగాయి. అయితే వన్యప్రాణుల సంరక్షణ విషయంలో అటవీశాఖ పకడ్బందీ జాగ్రత్తలు అమలు చేస్తుండడంతో రోడ్డు నిర్మాణ సమయంలోనే సంబంధిత అటవీ అధికారులు నేషనల్ హైవే (ఆర్ అండ్ బీ) శాఖ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు తీసుకున్న తర్వాతనే హైవే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలంటే అప్పట్లోనే హుకుం జారీ చేశారు. దీని కారణంగా నేషనల్ హైవే అధికారులు వన్యప్రాణులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను అటవీ శాఖ అధికారుల సహాయంతో గుర్తించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం యానిమల్ అండర్ పాస్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన అనంతరమే అటవీశాఖ రోడ్డు నిర్మాణ పనులకు అనుమతులు జారీ చేసింది.



జిల్లా కేంద్రం నుంచి
ఖానాపూర్ వైపు వెళ్లే నేషనల్ హైవే 61 రహదారి ఇదే

ఏడు చోట్ల యానిమల్ అండర్‌పాస్‌ల నిర్మాణాలు

కాగా నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు నిర్మించిన నేషనల్ హైవే నెంబర్ 61 రోడ్డుపై అటవీశాఖ అధికారులు గుర్తించిన ఏడు చోట్ల యానిమల్ అండర్ పాస్‌ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మొత్తం 61 కోట్ల రూపాయల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నారు. ప్రస్తుతం వీటి నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. మరో మూడు నెలల్లో వీటి నిర్మాణాలను పూర్తి చేసి హైవే రోడ్డును క్లియర్ చేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు. ఫ్లై ఓవర్‌లను తలపించే విధంగా ఈ అండర్‌పాస్‌లను మామడ మండలం బోరిగాం వద్ద ఒక అండర్‌పాస్, సాంగ్వి వద్ద రెండు అండర్ పాస్‌లను నిర్మిస్తున్నారు. వీటితో పాటు దిమ్మదుర్తి ప్రధానరోడ్డుపై మూడు చోట్ల, ఎగ్బాల్‌పూర్ సమీపంలోని ఖానాపూర్ జంక్షన్ వద్ద మరో అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నారు. ఈ అండర్‌పాస్‌లు నిర్మించే ఏడు చోట్ల అభయారణ్యంలోని వన్యప్రాణులు ఎక్కువ సంఖ్యలో సంచరిస్తుంటాయని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు.

మారిన అంచనాలు

మహారాష్ట్రలోని కళ్యాణ్ నుంచి నిర్మల్ మీదుగా జగిత్యాల వరకు 61 నెంబర్ నేషనల్ హైవే మార్గం కొనసాగుతోంది. అయితే కళ్యాణ్ నుంచి నిర్మల్ వరకు ఇప్పటికే నిర్మించిన హైవేను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలోకి తీసుకువచ్చారు. నిర్మల్ నుంచి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు నిర్మిస్తున్న ఈ హైవేను నేషనల్ హైవే (ఆర్ అండ్ బీ) పర్యవేక్షిస్తోంది. అయితే మొదట్లో నిర్మల్ నుండి ఖానాపూర్ వరకు ఫారెస్ట్ క్లియరెన్స్ లభించడంతో రూ.100 కోట్ల అంచనా వ్యయంతో ఈ హైవే నిర్మాణ పనులను చేపట్టారు. ఈ దశలోనే అటవీ శాఖ వన్యప్రాణుల సంరక్షణ విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అండర్‌పాస్‌లను నిర్మించాలని షరతు విధించింది. అండర్ పాస్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తేనే హైవే నిర్మాణానికి అనుమతులు జారీ చేస్తామంటూ అటవీశాఖ మెలిక పెట్టింది. దీంతో చాలా రోజులు హైవే నిర్మాణ పనులు స్తంభించిపోయాయి. ఎట్టకేలకు ప్రభుత్వం అండర్ పాస్‌ల నిర్మాణం కోసం 61 కోట్ల రూపాయలను ప్రత్యేకంగా మంజూరు చేయడమే కాకుండా ఏడు చోట్ల ఈ అండర్ పాస్‌ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అండర్ పాస్‌ల నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగానే హైవే పనులకు అటవీ శాఖ అనుమతులను జారీ చేసింది. ఇప్పటికే 90 శాతంకు పైగా హైవే రోడ్డు పనులు పూర్తికాగా మరో రెండు మూడు నెలల్లో అండర్ పాస్‌ల నిర్మాణాలు కూడా పూర్తి కానున్నాయి.

అడవుల గుండా జంతువులు ప్రమాదాలకు గురి కాకుండా
నిర్మించనున్న అండర్‌పాస్‌లతో కూడిన రోడ్డు నిర్మాణం

పనులు వేగంగా కొనసాగుతున్నాయి

సుభాష్, డీఈ, ఎన్‌హెచ్ (ఆర్ అండ్ బీ), నిర్మల్

నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు గల నేషనల్ హైవే పై ఏడు చోట్ల యానిమల్ అండర్ పాస్‌లను నిర్మిస్తున్నాం. మొత్తం 61 కోట్ల రూపాయలతో పనులు కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల్లోగా ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. హైవే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. అండర్ పాస్‌ల నిర్మాణాలు పూర్తయితే మొత్తం ఈ హైవే మార్గం క్లియర్ అవుతుంది. అటవీశాఖ నిబంధనల మేరకే అండర్ పాస్‌లను నిర్మిస్తున్నాం.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- అదనపు కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్



భైంసా,జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భైంసాలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వనాలు అంతరించిపోతుండడం మూలంగా సమస్యలు పెరుగు తున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతుండడం మూలంగా అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. జలకాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యం బారిని పడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు గాను ప్రతీఒక్కరు బాధ్యతగా భావించి పారిశుధ్య నిర్వాహణ వ్యవస్థకు సహకరించాలన్నారు. మొక్కలను విరివిగా నాటి సంరక్షించే బాధ్యతలను నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గాను ప్రతీ ఒక్కరు కంకణ బద్దులు కావాలన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. ఇందులో బాగంగానే స్థానిక గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలోని క్రీడా ప్రాంగణంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ మున్సిపల్ అధికారులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ ఆహ్మద్, టీపీవో అనురాధ, డీఈ సంతోష్‌లతో పాటు ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణంతోనే మానవ మనుగడ : సీసీఎఫ్ శర్వానంద్



నల్దుర్తి తుర్కం చెరువులో మొక్కలు నాటుతున్న సీసీఎఫ్ డీఎఫ్‌వో

మామడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణంతోనే మానవుడి మనుగడ ఉంటుందని బాసర సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ శర్వానంద్ అన్నారు. గురువారం రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నల్దుర్తి తుర్కం చెరువు వద్ద జిల్లా ఫారెస్ట్ అధికారి నాగిని భానుతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం చెరువు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ చెట్లను పెంచినట్లయితే తమ ఆరోగ్యానికి మంచి ఆక్సిజన్ అందుతుందని డాక్టర్ వద్దకు వెళ్లే శ్రమ తప్పుతుందని తెలిపారు. అటవీ సంరక్షణతో పాటు మొక్కల సంరక్షణ అందరూ బాధ్యతయుంగా అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌వో అన్నపూర్ణ, ఎఫ్‌బీవో లక్ష్మీనారాయణ, కమలాకర్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

సారంగాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు నిషేధించేలా చర్యలు తీసుకోవాలని బాసర సర్కిల్ సిసి ఎఫ్ శర్వానన్ అన్నారు. గురువారం మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల గండి రామన్న అర్బన్ పార్క్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించి పార్క్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు అంతం చేసేలా చర్యలు తీసుకొని పర్యావరణం కాపాడాలని అన్నారు. అనంతరం అర్బన్‌పార్క్ సమీపంలో గల రహదారి పక్కన ఉన్నటుంటి చెత్తను సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో అటవీశాఖ జిల్లా అధికారి నాగిని బాను, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు అబ్దుల్ హాది, భీమారెడ్డి, అధికారులు రామకృష్ణ, ఎండి నజీర్‌ఖాన్, సంతోష్ కుమార్, అటవీసిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి

పర్యావరణాన్ని కాపాడాలి

- ఆర్జీయూకేటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



మొక్కలు నాటుతున్న వీసీ గోవర్ధన్

బాసర, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బాసర రాజీవ్‌గాంధీ యూనివర్సిటీఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటి)లో ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీయూకేటి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఆర్జీయూకేటి, ఐక్య రాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీఎస్)ను అలము చేసిన మొదటి విశ్వవిద్యాలయమని తెలిపారు. ఆ దిశగా తొలి ముఖ్యమైన అడుగుగా మొక్కలు నాటే కార్యక్రమాన్నిఈ రోజు విశ్వ విద్యాలయం పరిసరాల్లో నిర్వహించినట్లు చెప్పారు. ప్రకృతిని ఆదరించడం ద్వారా మన విద్యార్థులలో పర్యావరణ పట్ల బాధ్యతను పెంపొందించడమే మా లక్ష్యమని అన్నారు. ఎస్‌డీజీ గోల్ 13, క్లైమేట్ యాక్షన్ గోల్ 15, భూమిపై జీవితం లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నానికి నాంది పలికినట్లు పేర్కొన్నారు. క్యాంపస్‌ను పచ్చదనంతో నిండిన స్థలంగా మార్చేందుకు, గ్లోబల్ స్థాయిలో సస్టైనబిలిటి లక్ష్యాలలో భాగస్వామిగా నిలవడానికై చేపట్టిన ప్రణాళికలలో మొదటిదిగా చెప్పారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్‌లు డా. విఠల్, నాగరాలు, డా. రాకేశ్‌రెడ్డి, పీఆర్వో డా.విజయ్‌కుమార్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, క్యాంపస్ బ్యూటిషన్ కమిటీ కలిసి సమన్వయం చేశారు. ఈ కార్యక్రమం చివర్‌లో అందరూ పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతిజ్ఞ చేశారు.

అధ్యాపకులు అప్‌గ్రేడ్ కావాలి

అధ్యాపకులకు ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా తద్వారా వారు 21వ శతాబ్ద పరిశ్రమ అవసరాకలకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేయగలుగుతారని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. ఆర్జీయూకేటిలో నవీన బోధన వ్యూహాలు అనే అంశంపై ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం(ఎఫ్‌డీపీ) గురువారం నిర్వహించారు. డిజిటల్ యుగంలో అధ్యాపకులు తమ బోధనలో నవీనీకతను, విద్యార్థి కేంద్రిత పద్ధతులను అంగీకరించాల్సిన అవసరాన్ని వివరించారు. పరిశోధన, ఆవిష్కరణలను ప్రాధాన్యంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక ఆహ్వానితులు ప్రముఖ శిక్షణ నిపుణులు రమేశ్ వేముగంటి వివిధ అంశాలపై మాట్లాడారు. తరగతుల్లో చైతన్యాన్ని సృష్టించడం, విద్యార్థులలో ఆసక్తిని పెంచడం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, విద్యార్థి బృంద గుణాత్మక చర్చలు, విద్యార్థుల ప్రయోగశాలలు, వర్క్‌షాపులు, ప్రాజెక్టులు, గ్లోబల్ థింకింగ్‌లో అభ్యాసాన్ని మెరుగుపరచడం ద్వారా ప్రభావవంతమైన బోధనకు అవసరమైన జీవన నైపుణ్యాలు కల్పించవచ్చని విశ్లేషించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం బోధన నాణ్యతను మెరుగుపరచడం, విద్యార్థుల భవిష్యత్తు దృష్టితో పరిశ్రమకు సిద్ధంగా చేయడం. డిజిటల్ యుగలంలో బోధనలో కృత్రిమమేధ(ఏఐ) పాత్ర, అలాగే పరిశోధనను ప్రాముఖ్యంగా తీసుకోవడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్‌లు డా. మహేశ్, డా. విఠల్, నాగరాలు, అధాప్యకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



దరఖాస్తులను లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

మామడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం రోజున మామడ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించి అమలులోకి తెచ్చిందని తెలిపారు. కుంటాల మండలంలో ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద సదస్సులు విజయవంతంగా నిర్వహించామని, ఇప్పుడు రెండో విడత భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలో నిర్వర్తించబోతున్నామని తెలిపారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తమ భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు సక్రమంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



మొక్క నాటుతున్న కలెక్టర్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నిర్మల్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చెట్లు మనకు నీడను, ఆక్సిజన్‌ను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ కొరకు పోరాడే దుస్థితి ఏర్పడుతుందన్నారు. కాలుష్యం పెరుగుతున్న నేపథ్యం లో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ తమ జన్మదినాలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్



మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్ నిలబడుతుందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్ అధ్యక్షతన జరిగిన 11 ఏళ్ల స్వపరిపాలనపై జిల్లా కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షులు శిల్పారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మోదీ పాలనపై ప్రశంసలు కురిపించారు. 11 ఏళ్ల మోదీ పాలనలో 11 ఏళ్ల క్రితం 11వ స్థానం ఉన్న భారత్ ప్రస్తుతం 4వ స్థానానికి చేరుకుందని తెలిపారు. 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ నిలబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత సైన్యం అనుకుంటే పాకిస్థాన్ దేశాన్ని చరిత్రపుటల్లో లేకుండా చేస్తామని హెచ్చరించారు. ప్రజాకర్షణ పథకాలతో మోదీ సర్కార్ ప్రజలకు చేరువయ్యారని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, మేడిసెమ్మెరాజు, పడిపెల్లి గంగాధర్, జిల్లా కన్వీనర్ ఒడిసెల అర్జున్, అసెంబ్లీ కన్వీనర్లు అంకం మహేందర్, సాయినాథ్, రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్, జిల్లాలోని మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నూతన ఆసుపత్రి ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

జిల్లాకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అరుణ్‌రెడ్డి హాస్పిటల్, నవ్య క్లినిక్‌లను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా, పట్టణ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

నిర్మల్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక దివ్యనగర్ పార్క్‌లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... మొక్కలు నాటితే స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

కడ్తాల్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటిన జిల్లా విద్యాశాఖాధికారి

సోన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో అమ్మ పేరిట జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు పరమేశ్వర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరం క్షేమంగా జీవించాలంటే మొక్కలను నాటాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్తలు ప్రవీణ్ కుమార్, లింబాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఐటీఐలో ప్రవేశాలకు

21 వరకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐ కోర్సులలో ప్రవేశాలకు ఆసక్తి, అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేయాలని నిర్మల్ కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. పది ఉత్తీర్ణులైన 16 ఏళ్ల బాలబాలికలు అర్హులని తెలిపారు. మార్కుల జాబితా ప్రకారం పుట్టినతేదీ ఆధార్‌కార్డులో ఉండాలన్నారు. వివరాలకు 9440232276, 9959242405 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోలీసుస్టేషన్ ఎదుట అపస్మారక స్థితిలో వ్యక్తి

- డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల దర్యాప్తు



దర్యాప్తు చేస్తున్న క్లూస్‌టీం

బాసర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బాసర పోలీస్‌స్టేషన్ ఎదుట అపస్మారక స్థితిలో పడిఉన్న వ్యక్తిని స్థానిక పోలీసులు గుర్తించారు. పోలీసుస్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై తలకు బలమైన గాయాలతో ఉన్న వ్యక్తి గుర్తించిన పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం భైంసాలో చికిత్స పొందుతున్నాడు. పోలీస్ స్టేషన్ ఎదుట తీవ్ర గాయాలతో పడి ఉండటం, దాని వెనుక కారణాలు ఏమై ఉంటాయో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో విచారణ చేపట్టారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు అన్నింటినీ ఆధారాల కోసం పరిశీలించారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో కేస్తు దర్యాప్తుకు ఆటంకంగా మారింది.

మహిళ కడుపులో నుంచి

6 కిలోల కణితి తొలగింపు

- భైంసా ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స





తొలగించిన కణితిని
చూపుతున్న వైద్యులు

భైంసా, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కడుపులో నొప్పి, శ్వాస ఇబ్బందితో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన మహిళకు భైంసా ఏరియా ఆసుపత్రి వైద్యుల బృందం శస్త్ర చికిత్స నిర్వహించి ఆమె కడుపులో నుంచి 6 కిలోల కణితిని తొలగించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు.మూడు రోజుల క్రితం ముథోల్ మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన చిన్నమ్మ (58) అనే మహిళ అనారోగ్యపు సమస్యలతో తీవ్ర అస్వస్తత చెంది వైద్య సేవల నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రిలో చేరింది. బాధిత మహిళకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన ఆసుపత్రి వైద్య బృందం ఆమె కడుపులో 6 కిలోల కణితిని గుర్తించారు. గురువారం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారిణులు డా. అపూర్వ రజనీకాంత్, డా. ప్రీతిలు సిబ్బందితో కలిసి బాధిత మహిళకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి కడుపులో గల 6 కిలోల కణితిని తొలగించారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యాధికారిణుల బృందాన్ని ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్‌తో పాటు పలువురు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రమేష్

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించవద్దు

● జిల్లా పంచాయతీ అధికారి రమేష్

తలమడుగు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పారిశుద్ధంపై నిర్లక్ష్యం వహించవద్దని డీపీవో జి.రమేష్ కోరారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం పొంచి ఉన్న ప్రమాదాలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారి రమేష్ గురువారం మండలంలోని సుంకిడి రైతు వేదికలో తాంసి, తలమడుగు రెండుమండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో ఎలాంటి పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేకచర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ కవర్లను గ్రామాల్లో వాడకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో డిఎల్‌పిఓ ఫణిందర్, ఎంపీఓ వినోద్ కుమార్, తాంసి, తలమడుగు మండలాల పంచాయతీ కార్యదర్శిలు ఉన్నారు.

రాజకీయ కుట్రలతోనే మాపై ఆరోపణలు

● ఇచ్చోడ మాజీ వైస్ ఎంపీపీ చౌహన్ దేవానంద్



మాట్లాడుతున్న మాజీ వైస్ ఎంపీపీ దేవానంద్, మాజీ సర్పంచులు

ఇచ్చోడ, జూన్5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కుట్రలతోనే తమ కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఇచ్చోడ మాజీ వైస్ఎంపీపీ దేవానంద్, ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచులు సునీత, ప్రమీల పేర్కొన్నారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. కలెక్టర్ ఇచ్చిన ఉత్వర్వులను స్వీకరించామని, తమకు ఇచ్చిన 30రోజుల గడువులో మేము ఎస్టీ లంబాడా కులస్థులమేనని నిరూపించుకుంటామని అన్నారు. 1990లో తాను కాంట్రాక్టర్‌గా లైసెన్స్ పొందడానికి ఎస్టీ లంబాడా సర్టిఫికెట్ పొంది ఉన్నానని అన్నారు. ఎన్నికల సమయాల్లో మాత్రమే తాను ఎస్టీ లంబడా జాతికి చెందినవాడిన కాదని ఆరోపిస్తున్నారని అన్నారు. రాజకీయంగా నన్ను ఎదుర్కొలేక ఎన్నికల సమయంలో ఇలా అధికారులపై ఒత్తిడి తెచ్చి కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. మా కుటుంబం ఎస్టీ లంబాడా జాతికి చెందినదేనని నిరూపిస్తునని ప్రకటించారు.

మూడు లీటర్ల నాటుసారా పట్టివేత

నార్నూర్, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామంలో గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు 3 లీటర్ల నాటు సారా పట్టుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ రూప్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చట్టానికి వ్యతిరేకంగా పని చేయొద్దని అన్నారు. గుడుంబా ఎవరైనా తయారు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ ముందు ముగ్గురిని బైండోవర్ చేశారు. వారివెంట అధికారులు ఆశన్న, విశాల్, స్రవంతి గంగాధర్ ఉన్నారు.

సాగులో రైతులు వృథా ఖర్చులు తగ్గించాలి

బోథ్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు వృథా ఖర్చులు తగ్గించి దిగుబడిని పెంచుకోవాలని శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహన్, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కౌటబి గ్రామంలోని రైతు వేదికలో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ఎరువుల వాడకం వల్ల నేల చౌడబారుతుందన్నారు. చౌడువారి నేలల్లో పంటల దిగుబడి రాదనే విషయాన్ని రైతులు గమనించాలన్నారు. అయితే ఏ ఏ భూమిల్లో ఏ ఏ రకమైన పంటలు వస్తాయని విషయాన్ని తెలుసుకునేందుకు భూసార పరీక్షలను జరుపుకోవాలని భూసార పరీక్షలు జరిగినట్లయితే ఏ రకమైన భూముల్లో ఏ విధమైన పంటలు సాగుతాయి అనే విషయాన్ని తెలుసుకోవడంతోపాటు ఎరువులను వినియోగించుకునే వీలుంటుందన్నారు. నేలలో ఉన్న పోషకాలను బట్టి ఎరువులు వాడాలని పక్క రైతు వేసిన ఎరువు కంటే ఎక్కువ వేసి నష్టపోవద్దన్నారు. పెట్టుబడి ఖర్చులను తగ్గించినట్లయితే రైతు ఆర్థికంగా ఎదిగే ఆస్కారం ఉందన్నారు. అయితే రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడవద్దని సేంద్రియ ఎరువుల వాడకంతో పంటల దిగుబడి వస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రవితేజ, వాజిద్, విడిసి అధ్యక్షులు బి. శ్రీకాంత్ రెడ్డి, ల్యాబ్ అసిస్టెంట్లు సందీప్, ప్రశాంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

ఉట్నూర్, జూన్5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అటవీ అధికారులు కోరారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఉట్నూర్ మండల కేంద్రంలోని ఫారెస్టు డివిజన్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా వినాయకచౌక్, జగ్జీవన్‌చౌక్, అంబేద్కర్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్, కోట్నాక్‌భీమ్రావు చౌక్‌ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ కృషి చేస్తుండగా కొందరు అడవులను నరికేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఉట్నూర్ మండలం సరిహద్దుల్లో ఉన్న బీర్సాయిపేట అటవి శాఖ పరిధిలోని గండి పోచమ్మ ఆలయానికి పర్యావరణాన్ని కాపాడం కోసం ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని అమలు చేయడానికి స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు విరాళంగా అందించారు. కార్యక్రమంలో బీర్సాయిపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఈర్ల అరుణ, ఉట్నూర్ అటవి రేంజ్ ఇన్‌చార్జీ ఎఫ్ఆర్‌ఓ షీలానంద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు సీతారాం, ప్రియాంక, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు ప్రేమ్‌సింగ్, జె.సుదర్శన్, గోపాల్‌నాయక్, జి.సుదర్శన్, ప్రేమ్‌దాస్, శంకర్, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, సిబ్బంది, బీర్సాయిపేట కేటీఆర్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపులో భాగంగా అమ్మపేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని ఉట్నూర్ బీజేపీ మండల నాయకులు విజయవంతం చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షులు బింగివెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, మండల కార్యదర్శి కాల్వ రవి, మాజీ ఎంపీటీసీ సీపతిలింగాగౌడ్, మాజీ ఎంపీటీసీ కందుకూరిరమేష్, బూత్ అధ్యక్షులు కాల్వసతీష్, దేవిదాస్, తదతరులు పాల్గొన్నారు.

బోథ్: పర్యావరణాన్ని పరిరక్షించకపోతే భావితరాలకు మనం ద్రోహం చేసిన వారమే అవుతామని బోథ్ సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు అయిన సమావేశంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు ఇప్పటికే వివిధ రకాల వ్యాధుల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరం కృషి చేయాలన్నారు. అంతకుముందు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ పంట పొలాల చుట్టూ విద్యుత్‌తీగలు అమర్చవద్దని కోరారు. ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. చంటితో పాటు అటవీశాఖ పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

నేరడిగొండ: మండలంలోని ఆరెపల్లి గ్రామసమీపంలోని జాతీయ రహదారిపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ సీ ప్రాజెక్టు మేనేజర్ సూర్యనారాయణ మాట్లాడుతూ నాటిన మొక్కలను కాపాడాలని సూచించారు. చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. నేరడిగొండలోని బుద్దికొండ - తేజాపూర్ శబరిమాత ఆశ్రమంవద్ద బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మొక్కలను నాటారు. బుగ్గరాం గ్రామంలో ఉపాధిహామీ సిబ్బంది గజ్జెల శంకర్. సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నార్నూర్: మండలకేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు బిక్కు రాథోడ్ మాట్లాడారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, సావన్, కోచ్‌లు మహేందర్, కపిల్, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని గలియాబాయి గ్రామంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ బీజేపీ మండల నాయకులు, గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో జీవన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముండే రమేష్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, మాజీ ఎంపిటిసి పద్వాల్ విజయ్ సింగ్, మాజీ అధ్యక్షుడు ఆరేల్లి రాజలింగం, మోరే దిలిప్, మాస్కే రాజవర్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్అర్బన్: అటవి శాఖ ఆధ్వర్యంలో డీఎఫ్ఓ కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని డీఎఫ్ఓ ప్రశాంత్‌బాజీరావ్ పాటిల్ ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా సాగింది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

(5వ పేజీ తరువాయి)

చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూసదస్సుల్లో భారీగా సాదాబైనామా దరఖాస్తులు రావడంతో అధికారులు పరిష్కారం చూపే పరిస్థితి కనిపించడం లేదు. వచ్చిన దరఖాస్తులను తీసుకుని పరిశీలించడమే తప్ప చట్టబద్ధత కల్పించడానికి వీలులేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో సాదాబైనామాలకు ఇప్పట్లో పరిష్కారం చూపడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులు చేసుకుంటున్న రైతులకు సాదాబైనామాల విషయంలోస్పష్టతనిచ్చే ప్రయత్నం కూడా చేయడం లేదంటున్నారు.

● చేతిలో ఆధారం లేక ఆందోళన

ఎన్నో ఏళ్లుగా కాస్తులో ఉన్న రైతులకు చేతిలో ఎలాంటి ఆధారం లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు భూమిపై హక్కుల కోసం కోర్టును ఆశ్రయించడంతో వివాదాలు కొనసాగుతున్నాయి. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు కూడా రైతులు దూరమవుతున్నారు. ఇప్పటికే అమలవుతున్న రైతుభరోసా, రైతుభీమా, పంట రుణాలు రైతులకు దక్కడం లేదు. నాలుగైదు దశాబ్దాల క్రితం తెల్ల కాగితాల పై క్రయ విక్రయాలు జరిపిన వారంతా ప్రస్తుతం మరణించడంతో వారసుల పేరిటా భూమిని బదలాయింపు చేయడం పెద్ద సమస్యగా మారింది. దీంతో భూపట్టా మార్పిడీ చేసేందుకు యజమాని వారసులెవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అసలు సాదాబైనామా దరఖాస్తుల విషయంలో ప్రభుత్వ ం ఎలా ముందుకు వెళ్తుందో అర్థం కావడం లేదని అధికారులే చెప్పడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న రైతులకు ఏ విధంగా న్యాయం చేస్తారో అధికారులు సమాధానం చెప్పలేని పరిస్థితి కన్పిస్తోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నర్సారెడ్డి మృతదేహం

బోథ్, జూన్5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు మండలంలోని పొచ్చెర జలపాతంలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. నేరగొండ మండలంలోని తేజపూర్ గ్రామానికి చెందిన రైతు గడ్డం నర్సారెడ్డి (55) పొచ్చెర జలపాతంలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డం నర్సారెడ్డి వ్యవసాయం కోసం రూ.10 లక్షల 80వేల వరకు అప్పులు చేశాడని, పంటల దిగుబడి రాకపోవడంతో తన భూమిని కౌలుకు ఇచ్చాడని కుటుంబీకులు పేర్కొన్నారు. చేసిన అప్పులు తీర్చలేకపోతున్నానని గడ్డం నర్సారెడ్డి రెండు రోజులుగా మద్యం తాగాడు. గురువారం ఉదయం పొచ్చెర జలపాతం వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. జలపాతం వద్ద కాపలాగా ఉన్న సిబ్బంది, అటవీశాఖ పోలీస్అధికారులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్, అటవీశాఖఅధికారులు చేరుకున్నారు. జలపాతంలో మృతదేహంపైకి తేలడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్సై ప్రణయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

34 మంది దళారులపై చీటింగ్ కేసు నమోదు

ఇచ్చోడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసగిస్తున్న 34మంది దళారులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రతీ ఏడాది రైతులకు తీసుకున్న రుణాలను వారే వడ్డీతో సహా కట్టేసి, తిరిగి రైతుల నుంచి ఒక రైతు నుంచి సుమారు 5వేల నుంచి 10వేల వరకు అధికంగా వసూలు చేస్తున్న దళారుల ఆట కట్టించారు పోలీసులు. ఎస్పీ అఖిల్ మహాజన్ జిలావ్యాప్తంగా 9మండలాల్లో పోలీసులను రైతులుగా మార్చి 16బృందాలను బ్యాంకులకు పంపించారు. రైతులను మోసం చేయాలనే చూసిన దళారులు పోలీసులతో బేరసారాలు చేయడం, రుణ మాఫీ తామేకట్టి ఎక్కువ రుణాన్ని కేటాయించి వచ్చిన దానిలో తమకు వాటా ఇవ్వాలని బేరాలకు దిగారు. ఇలా జిల్లాలోని వివిధ బ్యాంకుల వద్ద రైతులను మోసంచేస్తున్న 34మంది దళారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. ప్రతీ సంవత్సరం రైతులవద్ద నుంచి డబ్బులను దండుకుంటున్న దళారుల పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, బేల, తలమడుగు, భీంపూర్, మావల, ఇంద్రవెల్లి ప్రాంతాలో జిల్లా పోలీసులు స్వయంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి 34 మంది నిందితులను పట్టుకున్నట్లు వెల్లడించారు. వీరిపై ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో సెక్షన్ 318 ప్రకారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి

ఖానాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాన మంత్రి నరేందర్ మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్ పిలుపునిచ్చారు. గురువారం ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామంలో శ్రీశ్రీశ్రీ జగదాంబ మాత సేవాలాల్ నూతన ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమానికి రితేష్ రాథోడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ బృందంతో కలిసి రావి, వేప మొక్కలను నాటారు. అనంతరం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సైతం బీజేపీ నాయకులతో కలిసి రితేష్ మొక్కలు నాటారు. అమ్మ పేరిట మొక్క నాటడం ద్వారా ఈ మొక్కను సంరక్షించాలని బాధ్యత ప్రతి ఒక్కరిలో పెరుగుతుందనే భావంతో ప్రధాని మోదీ అమ్మ పేరిట మొక్క నాటాలని పిలుపునిచ్చారన్నారు. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. ఈ వేరువేరు కార్యక్రమల్లో బీజేపీ మండలాధ్యక్షులు పుప్పాల ఉపేందర్, మండల నాయకులు కాలేరి రాజేందర్, దూస గంగరాజం, బూత్ అధ్యక్షులు నేరెళ్ల రాజేందర్, మోతే రవీందర్, కొప్పుల భూమేష్, ఒడ్నాల బుచ్చన్న, ఒడ్నాల రాజేశ్వర్, బి.చిన్నారెడ్డి, కే.సాయి, ఎస్.రమేష్, కే.పోశెట్టి, ఏ.మహేష్, పూసర్ల రవీందర్, తదితరులున్నారు.

ప్రతీ ఒక్కరు కనీసం ఒక మొక్క నాటి పరిరక్షించాలి

దిలావర్‌పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు కనీసం ఒక మొక్క.నాటి పరిరక్షించాలని హరిత సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ అశోక్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండంపల్లి గ్రామంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ కన్వీనర్ చిన్నారెడ్డి, కొప్పుల శ్రీనివాస్, శేఖర్, మైనార్టీ అధ్యక్షుడు అరుణ్, అమీర్, తదితరులు ఉన్నారు.

'ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి వేయాలి'

నిర్మల్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం దేశంలోని వనరులను కారు చౌకగా కార్పొరేట్లకు అప్పజెప్పడంలో భాగంగానే ప్రజా ఉద్యమాల పైన పోరాటాల పైన సాయుధ పోరాటాల పైన తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్కౌంటర్లకు దిగుతుందని ప్రజా ఉద్యమకారులను నిర్మూలనకు ఒడిగట్టిందని నేతలు విమర్శించారు. మేధావులు, ప్రజా ఉద్యమకారులు దీనిని ఆపి వేయాలని మావోయిస్టుల తోటి చర్చలు జరపాలని, రాజ్యాంగాన్ని రక్షించాలని ప్రతిపాదిస్తుంటే కేంద్రం మాత్రం వారి నిర్మూలనకు పుకుంటుందని తక్షణమే ఇప్పటికైనా బూటకపు ఎన్కౌంటర్లు చేయడం మానివేసి మావోయిస్టుల తోటి చర్చించి ఆదివాసీలను, దేశ వనరులను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాంతి చర్చల కమిటీ నాయకులు అజయ్, టీజేఏసీ జిల్లా చైర్మన్ ఆరేపల్లి విజయ్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రమేష్, సీపీఐ ఎంఎల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, నిర్మల్ జిల్లా కార్యదర్శి కే. రాజన్న, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, సీపీఐ సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే. రాజు, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి)లో పారిశుధ్య పనులు

నర్సాపూర్(జి), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మేజర్ గ్రామ పంచాయతీ నర్సాపూర్(జి) పంచాయతీ కార్యదర్శి కైలాస్ గ్రామ పారిశుద్ధ్యం పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. బుధవారం జరిగిన అంగడి బజార్‌లో వ్యాపారస్తులు పారవేసిన చెత్తను గురువారం ఉదయాన్నే గ్రామ పంచాయతీ సిబ్బందితో స్వయంగా పర్యవేక్షించి, తొలగించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించారు.

అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తర్లపాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకు ఖచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. గురువారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం నిరుపేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, ఏఎంసీ చైర్మన్ భూమన్న, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, స్థానిక నాయకులు కట్ట శ్రీనివాస్, సార్లనర్సయ్య, రఘుపతిరెడ్డి, లక్ష్మణ్, గాజుల గంగన్న, ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి రిజ్వాన, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కడెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు లకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్మల్ జడ్పీ సీఈవో, డీసీవో, హౌసింగ్ పీడీ, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ మున్సిపల్ ఆఫీస్‌పై ఏసీబీ దాడులు

● రూ. 6వేల లంచం తీసుకుంటూ

పట్టుబడ్డ ఇన్‌చార్జి ఆర్ఐ, మరో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

నిర్మల్, మే జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ కార్యాలయంపై గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించగా.. ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి సంబంధించి అసెస్మెంట్ కోసం ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులను సంప్రదించాడు. ఇందుకోసం రూ. 6వేలు లంచం ఇవ్వాలని కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్ఐగా పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గైక్వాడ్ సంతోష్, అతని వద్ద అసిస్టెంట్‌గా పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి షోయబ్ అహ్మద్ డిమాండ్ చేశారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని సదరు వ్యక్తి.. ఈ విషయమై రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులకు ఇంటి యజమాని రూ. 6వేల లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులు గైక్వాడ్ సంతోష్, షోయబ్ అహ్మద్‌లను కరీంనగర్ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.



'దాహార్తి తీర్చే చెక్ డ్యామ్ కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

సోన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో నిర్మల్ పట్టణంలో ఏర్పడే నీటిఎద్దడి నివారణకు గాను సాకెర గ్రామ శివారులో ప్రభుత్వం చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టింది. ఈ చెక్‌డ్యామ్ నిర్మాణం వలన ఎండాకాలం నిర్మల్ పట్టణంలో నీటి కరువు తీరడంతో పాటుగా సాకెర పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగాయి. అంతేకాకుండా పరిసరాల రైతులకు పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇన్ని రకాలుగా ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ చెక్ డ్యామ్‌ను అధికారులు అకారణంగా కూల్చి వేయడం క్షమించరాని నేరం అంటూ నిర్మల్ జిల్లా తెలంగాణ ప్రజా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఆరేపల్లి విజయ్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర మంతా సాగునీరు, తాగునీరు అవసరాలకు అనుగుణంగా విరివిగా చెక్ డ్యామ్ నిర్మాణాలు చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులు, మేధావులు, రైతులు కోరిన మేరకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిందనే విషయాన్ని మరచిపోరాదని తెలియజేశారు.



చట్టానికి విరుద్ధంగా ప్రజల అవసరాలు తీర్చే ప్రాజెక్టులు కూల్చిన వారిపై వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల ప్రమేయం ఉన్నట్లయితే వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సాకెర చెక్ డ్యామ్ పరిశీలనలో వీరితో పాటు మాస్ లైన్ నాయకులు కట్ట రాజన్న, రామలక్ష్మణ్, బక్కన్న, గంగన్న, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గంగామాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల ప్రారంభం

దిలావర్‌పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో శ్రీ గంగామాత విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గంగపుత్ర సంఘం, గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో కాళేశ్వరం హైలెవెల్ కెనాల్ పక్కన గంగామాత విగ్రహ ప్రతిష్టాపనకు నిర్ణయించారు. గురువారం ఉదయం నుంచి యజ్ఞయాగాది పూజలు నిర్వహించారు. గంగపుత్ర మహిళలు కలశాలతో, నీటిబిందెలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. శుక్రవారం శ్రీ గంగామాత విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు.

రేడియాలజిస్టులు నిబంధనలు పాటించాలి : డీఎంహెచ్‌వో

నిర్మల్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రేడియాలజిస్టులు పీసీ, పీఎన్‌డీటీ 1994 చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య అధికారి రాజేందర్ సూచించారు. గురువారం తన కార్యాలయంలో రేడియాలజీ, గైనకాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ఆసుపత్రులపై,నిబంధనలు పాటించని వాటిపై కఠిన చర్యలుంటాయన్నారు. గర్భస్రావాలు నిర్వహించే ఆసుపత్రులు ఎంటీపీ చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డాక్టర్ సౌమ్య చట్టం నిబంధనలు వివరించారు. విస్తరణ అధికారి బి. రవీందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



నిర్మల్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆస్రా కాలనీకి చెందిన మాజీ సోషల్ మీడియా అధ్యక్షుడు అఖిల్ రెబల్ మాతృమూర్తి అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఇంటికి వచ్చి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించా లన్నారు. మంత్రితో పీవీ రమణారెడ్డి పీఏసీఎస్ చైర్మన్, రాజు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్, రవి, తదితరులున్నారు.

బూరుగుపల్లి(కే), చాక్‌పల్లి గ్రామాల్లో

విద్యాశాఖ అధికారుల పర్యటన

● మూతబడిన పాఠశాల..మౌలిక వసతుల కల్పనపై నివేదిక

నర్సాపూర్(జి), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బుధవారం కలెక్టర్ బూరుగుపల్లి(కే) పాఠశాలను సందర్శించి పలు సూచనలు చేసిన నేపథ్యంలో గురువారం మండల విద్యాశాఖ అధికారులు, మండల పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండల నోడల్ ఆఫీసర్ సాయన్న, మండల ఇన్ఫర్మేషన్ సిస్టం కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ వెంకట్రావు, మండల పంచాయతీ ఆఫీసర్ తిరుపతి రెడ్డి, చాక్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్‌లతో కూడిన బృందం బూరుగుపల్లి(కే), చాక్‌పల్లి గ్రామాల్లో గల పాఠశాలలను సందర్శించి, క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించారు.

ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ సాయన్న మాట్లాడుతూ... బూరుగుపల్లి(కే) గ్రామంలోని ప్రాథమిక పాఠశాల 2010 సంవత్సరం నుండి మూసి వేయబడిందని తెలిపారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, పైకప్పు పెచ్చులు ఊడిపోవడంతో భవనం పనికి రాకుండా పోయిందని ఆయన వివరించారు. ఈ మేరకు తాము పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపామని, భవనం పునర్నిర్మాణం లేదా కొత్త భవనం నిర్మాణానికి అనుమతులు కోరామని తెలిపారు.

గ్రంథాలయాలకు మహర్దశ

● పెరుగుతున్న పాఠకుల సంఖ్య ● పోటీ పరీక్షలకు అందుబాటులో పుస్తకాలు

●సోన్, సారంగాపూర్, దిలావర్‌పూర్, మామడ గ్రంథాలయాల భవనాల నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు

● నిర్మల్ జిల్లాలో 16 గ్రంథాలయాలు ● పాఠకులకు అందుబాటులో 1,74,971 పుస్తకాలు



నిర్మల్ జిల్లాలోని సెంట్రల్ లైబ్రరీ



ముథోల్ గ్రంథాలయం

ముథోల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో ఇక గ్రంథాలయాలకు మహర్దశ పట్టనుంది. గ్రంథాలయాల అభివృద్ధికి ఆ శాఖ జిల్లా చైర్మన్, అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 16 గ్రంథా లయాలు నడుస్తుండగా అందులో సుమారు 9 గ్రంథా యాలకు శాశ్వత భవనాలు ఉండగా 6 ఫ్రీ రెంట్ భవ నాలు ఒకటి అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. జిల్లాలో ముథోల్, కుబీర్, నర్సాపూర్, దిలావర్‌పూర్, లోకేశ్వరం, మా మడ, లక్ష్మణచాంద, భైంసా గ్రంథాలయాలకు శాశ్వత భవ నాలు ఉండగా, ఖానాపూర్, కడెం, పెంబి, బాసర, కుంటా ల, సారంగాపూర్ గ్రంథాలయాలు ఫ్రీ రెంట్‌లో కొనసాగు తుండగా తానూర్ గ్రంథాలయం అద్దె భవనంలో కొన సాగుతున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. అయితే శాశ్వత భవనాలు, ఫ్రీ రెంట్‌లో కొన సాగుతున్న గ్రంథాలయ భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరడం మరి కొన్ని మర మ్మతులకు రావడంతో వాటి స్థలంలో నూతన భవన నిర్మాణంకు నిధులు మంజూరు కా గా మరికొన్నింటికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ తెలిపారు. జిల్లాలోని 16 గ్రంథాలయాల్లో మొత్తం 1,74,971 వివిధ రకాల పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. ప్రతీరోజు నిర్మల్ జిల్లా కేంద్రంలో సుమారు 300ల నుండి 350 పాఠకులు, అలాగే మిగతా గ్రంథాలయల్లో రోజు ఒక్కో గ్రంథాలయంలో 50 మంది పాఠకులు అంటే రోజు 1200 నుంచి 1300ల మంది పాఠకులు గ్రంథాలయాల్లో పుస్తకాలను పఠనం చేస్తున్నారు.

పాఠకులకు మెరుగైన సౌకర్యాలు

జిల్లాలోని ఆయా మండలాల్లో గల గ్రంథా లయాలకు వచ్చే పాఠశాలకు మెరుగైన సౌక ర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రతీ గ్రంథాల యంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. పాఠకులకు కూర్చోవ డానికి కుర్చీలు గ్రంథాలయాల్లో పుస్తకాలు భద్రపరిచేందుకు అవసరమైన ర్యాక్‌లు, టేబుళ్లతో పాటు నేటి పోటీ ప్రపంచంలో పాఠకులకు సౌలభంగా ఉండేందుకు అందుబాటులో పోటీ పరీక్షలకు అవసర మగు పుస్తకాలను అందుబాటులో ఉం చుతున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. దశల వారీగా పాఠకులకు కావలసిన పుస్తకాలను నోట్ చే సుకొని గ్రంథాలయంలో పొందుపరిచే విధంగా ముందుకు వెళ్లనున్నట్లు తెలుస్తుంది.

గ్రంథాలయాల అభివృద్ధే మా లక్ష్యం..

- జిల్లా గ్రంథాలయ చైర్మన్, సయ్యద్ అర్జుమన్ అలీ

గ్రంథాలయాలను అభివృద్ధి పరిచి పాఠకులకు మెరుగైన సౌకర్యాలు, అవసరమగు పుస్తకాలు అందుబాటులో ఉంచడమే మా లక్ష్యం. జిల్లాలో కొత్తగా ఏర్పడిన సోన్ మండలానికి గ్రంథాలయంతో పాటు కొత్త భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూర య్యాయి. దిలావర్‌పూర్, సారంగాపూర్, మామడ మండలంలోని పాత భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణానికి ఒక్కొక్క భవనానికి రూ. 20 లక్షల చొప్పున ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఖానాపూర్, బాసర, ముథోల్, భైంసాలలోని గ్రంథాలయ భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చొరవతో అవసరమైన నిధులు మంజూరుకు కృషి జరుగుతుంది.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

- కే.రాకేష్ పాఠకుడు, ముథోల్



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పుకోవచ్చు. పేద తరగతికి చెందిన విద్యార్థులకు, నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. అయితే జిల్లాలోని కొన్ని గ్రంథాలయాల్లో మౌలిక వసతులతో పాటు గ్రంథాలయాల శాఖలలో ఖాళీలను భర్తీ చేయాలి. శాశ్వత భవనాలు ఏర్పాటు, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు, నిరుద్యోగులకు పోటీ పరీక్షల సన్నద్ధంకు ఉపయుక్తంగా ఉంటుంది. అవసరమగు పుస్తకాలు వచ్చినట్లయితే మరింత ఉపయోగకరంగా ఉంటాయి. మా ముథోల్ గ్రంథాలయంలో కూడా నూతన భవనం ఏర్పాటు చేసి పాఠకులకు మరికొన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్త కాలను ఏర్పాటు చేస్తూ ఫర్నిచర్ ఏర్పాటు చేసినట్లయితే పాఠకులకు మరింత సౌకర్యంగా ఉంటుంది.

నేటి నుంచి బడి బాట

● ప్రవేశాలు పెంచేలా కార్యాచరణ

● సన్నద్ధమైన ఉపాధ్యాయులు

● నేటి నుంచి 19 వరకు రోజువారీ కార్యక్రమాలు



భైంసా మండలంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

భైంసా, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సర్కారు పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా యేటా విద్యాశాఖ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బడిబాట నిర్వహించాలంటూ ప్రభుత్వం గత నెల ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 6వ తేదీ నుంచి 19 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులను బడిలో చేర్పించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు ఉపాధ్యాయులంతా సన్నద్ధం కావాలని, ఇందులో భాగంగా బాల కార్మికులను, బడి బయటి పిల్లలను, అనాథలను, అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ప్రతి శుక్రవారం వేసవి సెలవుల్లోనూ తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, బడిలో కల్పిస్తున్న వసతులను వివరిస్తూ ముందస్తు బడిబాట నిర్వహిస్తున్నారు.

● తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతోంది. ప్రభుత్వం ఎన్నో వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికి తల్లితండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు మక్కువ చూపుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత మూడు సంవత్సరాలుగా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య వివరాలు ఇలా ఉన్నాయి. 2022 - 23 విద్యా సంవత్సరంలో 49,943 మంది విద్యార్థులు ఉండగా 2023-24 విద్యా సంవత్సరములో విద్యార్థుల సంఖ్య 44,429 తగ్గింది. ఇక 2024-25 విద్యార్థుల సంఖ్య 41,067 పడిపోయింది. 2025-26 విద్యా సంవత్సరములో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇందుకు జిల్లా కలెక్టర్, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, మహిళా సంఘాలను ఇందులో భాగస్వామ్యం చేశారు. ప్రభుత్వం అందించిన విధి విధానాలకు అనుగుణంగా బడిబాట కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ జిల్లా సమన్వయ అధికారి తెలిపారు.

● బడిబాట కార్యక్రమాలు ఇలా..

6వ తేదీన ప్రజలతో గ్రామసభలు నిర్వహించాలి.

7న ఇంటింటా సర్వే న్విహించి బడి ఈడు పిల్లలను గుర్తించాలి.

8-10 వరకు కరపత్రాలతో ఇంటింటా ప్రచారం. బడి బయటి, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలను బడిలో నమోదు చేయించాలి.

11న బడిబాట ఫలితాలపై సమీక్షించాలి. 12న అమ్మ ఆదర్శ పాఠశాల ల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల ప్రారంభం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించాలి. 13న సామూహిక అక్షరభ్యాసం, బాలల సభ

16న ఎఫ్‌ఎల్‌ఎన్ లీప్ దినోత్సవం నిర్వహించాలి.

17న విలీన విద్య, బాలికా దినోత్సవం

18న మొక్కల పెంపకం దినోత్సవం, తరగతి గదులు డిజిటలీకరణపై అవగాహన 19న క్రీడా పోటీలు నిర్వహించాలి.

మూడు నెలల బియ్యం కోసం రేషన్ కార్డుదారుల పాట్లు

● వివరాల నమోదులో ఇబ్బందుల పాలవుతున్న డీలర్లు

● మూడుసార్లు వేలి ముద్రలు, ఆరు సార్లు తూకం

● రేషన్ దుకాణాల వద్ద కార్డుదారుల నిరీక్షణ

భైంసా, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోసం కార్డుదారులు పాట్లు పడుతున్నారు. వర్షకాలం నేపథ్యంలో కార్డుదారులకు మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగానే రేషన్‌షాపులకు మూడు నెలలకు సరిపడా బియ్యం నిల్వలను ప్రణాళికబద్ధంగా సరఫరా చేస్తోంది. అయితే మూడు నెలల కోటాను తీసుకునేందుకు గాను కార్డుదారులు రేషన్‌షాపులకు అధికంగా తరలివస్తుండటంతో రద్దీ నెలకొంటోంది. తమకు సకాలంలో రేషన్ బియ్యం అందుతాయో లేదోనన్న అనుమానంతో కార్డుదారులు ఒకే సమయంలో రేషన్‌షాపులకు తరలివస్తున్నారు. దీంతో రేషన్‌షాపులు క్రిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి. కాగా బియ్యం పంపిణీ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఏర్పడుతుండటంతో పాటు మారిన సాఫ్ట్‌వేర్ వినియోగించడంలో రేషన్ డీలర్లు అవగాహన లోపంతో అవస్థలు పడుతున్నారు. ఇక సన్నబియ్యం పై కార్డుదారుల్లో ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలో వాటిని తీసుకునే వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. ప్రస్తుతం జూన్ నెలతో పాటు జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యం కోటాను కార్డుదారులకు అందిస్తున్నారు.

● జిల్లాలో 412 రేషన్ షాపులు

జిల్లాలో 19 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లో 412 రేషన్ దుకాణాలున్నాయి. ఇటీవల ప్రభుత్వం కొత్తగా నూతన రేషన్ కార్డులు మంజూరు చేసింది అంతే కాకుండా కొత్తగా సభ్యుల చేరికకు అవకాశం కల్పించడంలో లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో 2,19,972 రేషన్‌కార్డులుండగా 7,03,796 మంది లబ్దిదారులున్నారు. ఈ క్రమంలోనే గత ఏప్రిల్ నుంచి సన్న బియ్యం అందిస్తుండడంతో చాలా మంది కార్డుదారులు సంబంధిత బియ్యాన్ని తీసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

● ఒక్కో కార్డుదారుని వివరాల నమోదుకు 15 నిమిషాలకు పైగానే సమయం..



భైంసాలోని ఓవైసీనగర్ కాలనీలో రేషన్‌షాపు వద్ద బారులు తీరిన లబ్దిదారులు



భైంసాలో రేషన్‌షాపు వద్ద వేలిముద్ర వేస్తున్న రేషన్‌కార్డుదారులు

ఈ నెల 1 నుంచి మూడు నెలల బియ్యం కోటా పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మూడు నెలలకు సంబంధించి ఈ-పోస్ యంత్రంలో మూడు సార్లు వివరాలను నమోదు చేసి ఆరు సార్లు వేలి ముద్ర తీసుకోవాల్సి వస్తోంది. ఇటీవల ఈ-పోస్ యంత్రం ఆప్‌డేట్ జరగ్గా, కార్డుదారుల వివరాలను అందులో నమోదు చేసి వేలిముద్ర తీసుకోవడానికి పలువురు డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న డీలర్లకు అర్థం కాక సుమారు ఒక కార్డుదారుడి వివరాలు నమోదుకు 15 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. దుకాణం వద్ద రద్దీ నెలకొనడం, బియ్యం పంపిణీకి సమయం పడుతుండడంతో చాలా మంది వెనుదిరిగి వెళ్తున్నారు. మరో సారి రావాలని డీలర్లు కార్డుదారులకు సూచిస్తున్నారు.

● దుకాణాల వద్ద రద్దీ

వర్షకాలం నేపథ్యంలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఒకే సారి రేషన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని రేషన్ దుకాణాలకు బియ్యం స్టాక్‌ను పంపించారు. మూడు నెలలకు సంబంధించిన అవసరమైన బియ్యం నిల్వలు రేషన్‌షాపులకు 80 శాతానికి పైగా సరఫరా జరిగింది. ఈ క్రమంలో కార్డుదారులు బియ్యం కోటా తీసుకునేందుకు గాను అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో రద్దీ నెలకొంది. అయితే ప్రతికూల పరిస్థితుల మూలంగా బియ్యం పంపిణీ ప్రక్రియలో జాప్యం పెరుగుతోంది. నమోదు ప్రక్రియకు సమయం అధికంగా పడుతుంటంతో కార్డుదారులు గంటల తరబడి రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. .

జిల్లాలో వివరాలు..	
రేషన్ దుకాణాలు	: 412
రేషన్ కార్డులు	: 2,19,972
లబ్ధిదారులు	: 7,03,796
మూడు నెలల కోటా మెట్రిక్ టన్నులు	: 13,286

మొక్కను నాటి ఆదర్శంగా నిలిచిన నూతన వధూవరులు

ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూతన వధువరులు మొక్కను నాటి ప్రకృతి ప్రేమికులయ్యారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్‌లో యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక జిల్లా శాస్త్ర ప్రచార కన్వీనర్ వేముల నాగ రాజు తన భార్య దీపికతో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా చెట్లు, పర్యావరణ అవశ్యకతను అందరికీ వివరించారు. పెళ్లిలో చెట్ల ప్రాముఖ్యతని వివరించారంటూ సోషల్ మీడియాలో వారిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, ఉషన్న జిల్లా కమిటీ సభ్యులు శ్రీధర్ బాబు, సంతోష్ కుమార్, వీరన్న, గంగన్న, శ్రీనివాస్, లింగన్న ఆత్రం సంతోష్, రంజిత్ రెడ్డి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21 వరకు ఏటీసీ, ఐటీఐలకు ప్రవేశాలు ప్రారంభం

ఉట్నూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధి శిక్షణ విభాగం, హైదరాబాద్ వారు ఇచ్చిన నోటిఫికేషన్ నెంబర్ 1-1/1480/2025 ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలు/ప్రైవేట్ ఐటీఐలు/మైనార్టీ ఐటీఐలు ఆధునిక సాంకేతికత కేంద్రాలలో (ఏటీసీఎస్) ఆగస్టు 2025 సెషన్‌కు ఐటీఐ కోర్సులలో ప్రవే శాలు ప్రారంభించబడ్డాయని ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 10వ తరగతి /8వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు ఈ నెల 21 వరకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసు కోవచ్చన్నారు. అభ్యర్థులు 01-08-2025 నాటికి కనీసం 14 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలని, గరిష్ట వయో పరిమితి లేదన్నారు. అ న్ని అసలు సర్టిఫికేట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అభ్యర్థులు ఒకే దరఖాస్తు ద్వారా రాష్ట్రంలోని ఏదైనా ఐటీఐ/ఏటీసీకు వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఈ నెల 21 వరకు దరఖాస్తు ఫీజు రూ.100 చెల్లించి ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తప్పనిసరిగా ఇవ్వాల న్నారు. దరఖాస్తులో ఇచ్చిన సమాచారం మారితే సీటు రద్దయ్యే అవకాశం ఉందన్నారు. సీ ట్లు రిజర్వేషన్ నిబంధనల ప్రకారం, వెబ్‌ఆప్షన్ల ఆధారంగా కేటాయించబడతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వబడుతుం దన్నారు. దివ్యాంగులు, కమ్యూనిటీ (కాస్ట్ సర్టిఫి కేట్లు తప్పని సరిగా తెలంగాణ ప్రభుత్వం ద్వా రా మంజూరైనవే ఉండాలని, డౌట్లు లేదా స్పష్టత కోసం రాష్ట్ర ప్రభుత్వం డీజీటీ, న్యూఢిల్లీ సూచనల ప్రకారం మార్పులు చేయవచ్చున న్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తగిన ధ్రువపత్రాలతో తొందరగా దర ఖాస్తు చేసుకోవాలని కోరారు.



ఉట్నూర్‌లోని ఏటీసీ భవనం

ఎన్నికలపై యువత ఆసక్తి

● రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం ● ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రచార్భాటం

● చదువుకున్న యువత వైపే ప్రజల మొగ్గు

భీంపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతున్నట్లు తెలుస్తోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో యువకులు స్థానిక సంస్థల ఎన్నికల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన పోటీకిసై అంటున్నారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో గ్రామ పెద్దలను యువతను కలిసి తను పోటీలో నిలబడుతున్నట్లు ప్రచారాలు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీలకు పోటీ చేసేందుకు యువత ఆసక్తి కనబరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను మచ్చిక చేసుకుంటూ వారికి కావాల్సిన పనులను చేసి పెడుతున్నారు. ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటీలో ఉండేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధానంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు పార్టీ ప్రతిపదికన ఎన్నికలు ఉంటాయి. సర్పంచులకు వారు సభ్యులకు ఎలాంటి సింబల్లు ఉండవు, అయినప్పటికీ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నిక వాతావరణం వేడి ఎక్కుతోంది. జూన్, జులై మాసాల్లో ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం ఊపు అందుకోవడంతో యువత ఎన్నిక సమరానికి సంసిద్ధులు అవుతున్నారు. ఈ సారి చదువుకున్న యువతకే అవకాశాలు ఎక్కువగా ఉండేలా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా చదువుకున్న యువత పట్లనే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తుందో వేచి చూడాల్సిందే.



భీంపూర్ ముఖ చిత్రం

● యువతకే అవకాశం ఇస్తే బాగుంటుంది

స్థానిక సంస్థ ఎన్నికల్లో యువతకు అవకాశం ఇస్తే బాగుంటుంది. యువకులు ఎక్కడికైనా వెళ్లి పనులు చేయిస్తారు. చురుగ్గా పనుల కోసం పరుగులు తీస్తారు. అధికారులను పరుగు పెట్టిస్తారు. గ్రామాభివృద్ధి కోసం అధికారులతో పనులు చేయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు.

- మాడావి దీపక్, యువకుడు, గొల్లగాట్, భీంపూర్ మండలం



● విద్యావంతులు ఉంటే బాగుంటుంది

విద్యావంతులు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యావంతులకే అవకాశం ఇవ్వాలి. చదువుకున్న వారు ఉంటేనే గ్రామానికి మండలానికి అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం పాటుపడతారు. ప్రజల చిన్న పెద్ద సమస్యలు ఉన్న విద్యా వంతులు ఉంటే కార్యాలయాల చుట్టూ తిరిగి సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో కృషి చేస్తారు.

- మహ్మద్ అల్వీద్ అహ్మద్, విద్యావంతుడు, ధన్నోరా, భీంపూర్ మండలం








విత్తన, ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- రెవెన్యూ సదస్సుల్లో భారీగా సాదాబైనామా దరఖాస్తులు
- మూడేళ్ల క్రితమే దరఖాస్తు చేసుకున్న 2,083 మంది రైతులు
- కోర్టు కేసులతో తీవ్రజాప్యం
- ఇప్పటికీ చేతికి అందని భూ పట్టాలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ దూరమవుతున్న అన్నదాతలు
- స్పష్టత లేకపోవడంతో తప్పని ఎదురుచూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే రైతుల ఆశలు



ఆదిలాబాద్‌రూరల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా!?

ఆదిలాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న భూభారతి రెవెన్యూ చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. ఇందులో ఎలాంటి భూ సమస్యలైనా పరిష్కరించే విధంగా జిల్లా అధికారులు రెవెన్యూ గ్రామాల్లో సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జూన్ 3 నుంచి 20 వరకు మూడో విడత రెవెన్యూ సదస్సులను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తారు. అయితే ఇందులో భారీగా సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు వస్తున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. తెల్ల కాగితాలపై క్రయవిక్రయాలు జరిపిన భూములకు చట్టబద్ధత కల్పించేందుకు గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి సాదాబైనామా దరఖాస్తులను తీసుకున్నారు. దీంతో అర్హులైన రైతులు మీసేవా కేంద్రాల ద్వారా మండల తహసీల్దార్‌లకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో జిల్లావ్యాప్తంగా 2083 సాదాబైనామా దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. దరఖాస్తులు స్వీకరించి మూడేళ్ల గడుస్తున్నా పరిష్కారం చూపక పోవడంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్తగా భూభారతి రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిద్వారా భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే గత మూడేళ్ల క్రితం దరఖాస్తులు చేసుకున్న సాదాబైనామాలకు ఈ సారైన పరిష్కారం చూపుతారా లేదా అనే వాదనలు జోరుగా వినిపిస్తున్నాయి.



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ (ఫైల్)

అధికారుల హడావుడి

గతంలో సాదాబైనామా దరఖాస్తులను తీసుకున్న అధికారులు అప్పట్లో ఎంతో హడావుడి చేశారు. ఆ తర్వాత అసలు విషయాన్నే పూర్తిగా మరిచిపోయారు. కనీసం దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో రైతులకు చెప్పే ప్రయత్నం కూడా చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 2,083 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో తలమడుగు మండలంలో అత్యధికంగా 343 దరఖాస్తులు రాగా అత్యల్పంగా సిరికొండ మండలంలో 8 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా మళ్లీ రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా కాస్తులో ఉన్న భూ పట్టా లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ధరణిలో యజమానుల పేరిట మళ్లీ భూ పట్టాలు జారీ కావడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. చాలా గ్రామాలలో భూ వివాదాలు తలెత్తుతున్నాయి. గత మూడేళ్లుగా ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో సాదాబైనామా దరఖాస్తుల విషయంలో అడుగు ముందుకు పడినట్లు కనిపించడం లేదు. అసలు అధికారుల వద్ద దరఖాస్తులు ఉన్నాయో లేవో చెప్పలేని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

న్యాయపరమైన చిక్కులు

తెల్లకాగితాలపై క్రయవిక్రయాలు జరిపిన భూములకు ఎలా చట్టబద్ధత కల్పిస్తారంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో సాదాబైనామాలకు బ్రేక్ పడింది. అప్పటి నుంచి దీనిపై కదలిక లేకపోవడంతో దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. న్యాయపరమైన చిక్కులు ఉండడంతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే సాదాబైనామాలపై ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని రెవెన్యూ అధికారులు (మిగతా 6వ పేజీలో..)

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్, జూన్5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం జిల్లాలోని పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించి భూభారతిపై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. అనంతరం విత్తన దుకాణాలు, ఎరువుల గోదాములను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అర్లి(బీ), లాండసాంగి, చాందా(టీ), తంతోలి, మావల మండలంలోని సరస్వతినగర్‌లో రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. దరఖాస్తుల వారీగా ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చే వారి కోసం కేంద్రాలలో అవసరమైనన ఏర్పాట్లు చేయాలన్నారు. హెల్ప్‌డెస్క్ ద్వారా సహాయ సహకారాలను అందించాలన్నారు. రెండుబృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్లి(బీ)లో లక్ష్మీప్రసన్న ఫర్టిలైజర్ షాపుతో పాటు బెల్లూరిలో శ్రీబాలాజి ఫర్టిలైజర్ షాపు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిల్వ చేసిన ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులను విక్రయిస్తున్న తీరును పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవింద్, మండల వ్యవసాయ అధికారి తదితరులున్నారు.

భూసమస్యలకు పరిష్కారం చూపాలి: ఎమ్మెల్యే

ఆదిలాబాద్, జూన్5 (ఆంధ్రజ్యోతి): గతంలో ధరణితో రైతులు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడ్డారని, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న భూభారతి రెవెన్యూ చట్టం ద్వారానైనా భూసమస్యలకు పరిష్కారం చూపాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుకు వచ్చే రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తీసుకుంటున్న దరఖాస్తులను పరిశీలించారు. ఆయనవెంట దయాకర్,వెంకన్న, ముకుంద,మల్లేష్ ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, జూన్5 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో పాటు శారీరక శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని బుగ్గారంలో టీబీపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమన్నారు. కార్యక్రమాల్లో ఎంఎల్‌హెచ్‌పీ నిఖిత్, హెల్త్ అసిస్టెంట్ సంతోష్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు'

ఉట్నూర్, జూన్5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. గురువారం మండలంలోని పులిమడుగులో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల పంచాయతీ అధికారి సుధీర్‌రెడ్డి, హౌజింగ్ ఏఈ వంశీతో కలిసి సుగుణక్క భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుపత్రాలను అందించారు. అనంతరం సుగుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నేరవేరుస్తోందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ నవీన్‌కుమార్, కారోబారి పత్తుసింగ్, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ రాష్ట్ర కన్వీనర్ సునిల్ జాదవ్, నాయకులు సంతోష్‌జాదవ్, అభిషేక్ పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు కేటాయించారు..

సిరికొండ, జూన్5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన నిరుపేదలకు కాకుండా అధికారులు అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని పొన్న గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆరోపించారు. గురువారం పొన్నగ్రామ మాజీ ఎంపీటీసీ చవాన్ సూర్యకాంత్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవీందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సూర్యకాంత్ మాట్లాడుతూ పొన్నగ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ద్వారా ఎంపిక చేసిన నిరుపేదలైన లబ్ధిదారుల పేర్లను తొలిగించి, అధికారులు అధికార పార్టీ నాయకులు సూచించిన అనర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం అన్యాయమన్నారు. కమిటీ ఎంపిక చేసిన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె. సదానందం, శారద, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని సత్వరం చేపట్టాలి

బోథ్,జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారితోపాటు గ్రామ కార్యదర్శి చిన్న గంగయ్య ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణం జరిగిన కొద్దీ నిధులు లబ్ధిదారుల అకౌంట్‌లో జమ అవుతాయని పేర్కొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

బోథ్, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం సాయంత్రం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఉపేందర్ జాదవ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని వసతులను, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో చేపట్టాల్సిన వైద్య సేవలను వివరించారు. రోగుల ఆరోగ్య పరి స్థితిల గురించి అడిగి తెలుసుకున్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

నేరడిగొండ,జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తమ సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని, తమ సాగుభూములో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆపాలని మండలంలోని తర్లం గ్రామానికి చెందిన 35మంది దళిత రైతులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడాల స్వామి మాట్లాడుతూ తర్లం గ్రామానికి చెందిన 35మంది దళిత రైతులు గత 40ఏళ్లుగా 76 ఎకరాల భూమిని సాగు చేస్తున్నారని, ఆ సాగు భూమిలో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటి కార్యక్రమం మానుకోవాలని అన్నారు. భూములపైనే ఆధారపడి జీవితస్తున్నారని అన్నారు. గత రెండు మూడు సంవత్సరాల క్రితం అటవీభూమి పరిధిలో కందకాలు తవ్వి ప్రస్తుతం కందకాల పరిధి దాటి తమ భూములే ఉన్నాయని అనడం ఎంతవరకు సమంజసమన్నారు. గతంలో సాగుకు సంబంధించిన పహాణీ పత్రాలు ఉన్నాయని అన్నారు. ఈ విషయంలో తహసిల్దార్ చొరవ తీసుకొని దళిత రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కలెక్టర్‌ను కూడా కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సు దృష్టికి 42 భూసమస్యలు

ఉట్నూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్ పరిశీలించారు. ప్రజల భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజల సమస్యలు ఓపికగా విని తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాలలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల దృష్టికి 42 భూసమస్యలు వచ్చాయని ఉట్నూర్ ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్ అమృతలాల్ తెలిపారు. హస్నాపూర్‌లో 14, రామలింగంపేటలో 4, నర్సాపూర్‌లో 22 గొట్టిలో 2 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ప్రజల సమస్యలను కంప్యూటరీకరణ చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గిర్దావర్లు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌అర్బన్,జూన్5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళాడిగ్రీ కళాశాల ఆదిలాబాద్ 2025 ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ (మహిళ) కళాశాల ప్రిన్సిపాల్ డా.జె.అరుణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ(ఎంఎస్‌సీఎస్), బీఎస్సీ (బీజడ్సీ),బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్), బీఏ (హెచ్‌పీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఈనెల 23 వరకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

'నోటరీ లేకుండా కులధ్రువీకరణ పత్రాలివ్వాలి'

ఇంద్రవెల్లి, జూన్5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ మహర్ కులానికి నోటరీ లేకుండా తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీలలో కొన్ని కులాలకు ఆర్డీఓ ద్వారా, మరికొన్ని కులాలకు తహసీల్దార్ ద్వారా కులధ్రువీకరణ పత్రాలు జారీచేయడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఇందులో మండల ప్రధానకార్యదర్శి వాగ్మారే కామరాజ్, దళిత సంఘాల నాయకులు మోరే దిలిప్, మాస్కే రాజవర్ధన్, కాలే శివాజీ, సోమోరే గౌతమ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు అటెండర్ ఉద్యోగం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కారుణ్య నియామకాల్లో భాగంగా ఆదిలాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో ఓ ట్రాన్స్‌జెండర్‌కు అటెండర్‌గా ఉద్యోగం కల్పించింది. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ హనుమాన్ కాలనీకి చెందిన పద్మ జడ్పీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ 2024 మరణించింది. కారుణ్య నియమకాల్లో తన కూతురైన సీహెచ్ అర్చనకు ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగం ఇచ్చారు. కాగా ఆమె గురువారం విధుల్లో చేరింది. ఈ సందర్భంగా సీహెచ్ అర్చన మాట్లాడుతూ తన తల్లి మరణించడంతో ఆ మెస్థానంలో తనకు ఉద్యోగం రావడం ఆనందంగా పేర్కొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న జడ్పీ సీఈఓ

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్

నేరడిగొండ, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాలకె గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పనులను బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆడే వసంత్ రావ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, పోతారెడ్డి. ఆడే రమేష్. వసంత్ మౌలానా, రాయలు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జైనథ్ ఎంపీడీఓ రవీంద్రనాథ్

జైనథ్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని జైనథ్ ఎంపీడీఓ రవీంద్రనాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన జైనథ్‌లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన ధృవ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జైనథ్ గ్రామ కార్యదర్శి ముజీబ్, జైనథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అల్లూరిఅశోక్‌రెడ్డి, జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ అడ్డిరూకేష్‌రెడ్డి, నాయకులు ఎన్.వెంకన్నయాదవ్, బద్దంసురేష్‌రెడ్డి, కె.లస్మన్న, ఎన్ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు అప్రమత్తంగా ఉండండి

- భీంపూర్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్



భీంపూర్ పోలీస్‌స్టేషన్‌కి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



భీంపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

భీంపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ నేపథ్యంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం భీంపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దులో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిఒక్కరు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గంజాయి, అక్రమ దేశీదారు, ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన గస్తీని నిర్వహించి అరికట్టాలన్నారు. వీధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని ఆటంకం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలన్నారు. రాత్రి సమయాల్లో ఫింగర్ ప్రింట్ డివైజ్ ద్వారా అనుమానితులను గుర్తించాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఉండేరికార్డులు ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది చేసే వీధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో జైనథ్ సీఐ సాయినాథ్, భీంపూర్ ఎస్ఐ పీర్ సింగ్ నాయక్, ఏఎస్ఐలు ముంతాజ్ అహ్మద్, గంగారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



హైదరాబాద్‌కు కోచింగ్ కోసం వెళ్తున్న విద్యార్థుల బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన పీఓ, డీడీలు

ఉన్నత లక్ష్యం కోసం విద్యార్థులు శ్రమించాలి

ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉన్నత లక్ష్యంకోసం విద్యార్థులు శ్రమించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. హైదరాబాద్‌లోనే మోడల్స్ కళాశాలలో ఉచిత ఇంటర్, ఐఐటీ, జేఈఈ కోచింగ్ కోసం ఎన్నికైన విద్యార్థులను ఉద్దేశించి గురువారం మాట్లాడారు. గత ఏప్రిల్‌లో ఆశ్రమ గురుకుల పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థులను రాత పరీక్ష ఇంటర్వ్యూల ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంబంధించిన 15మంది విద్యార్థులను ఎంపిక చేశారని, వీరికి నాణ్యమైన ఐఐటీ, జేఈఈ, కోచింగ్ కోసం ఐటీడీఏ ద్వారా చదివిస్తున్నామని అన్నారు. ఎంపికైన 15మంది ప్రతిభ కలిగిన పేద గిరిజన విద్యార్థులని, వారు జీవితంలో ఉన్నత శిఖరాలను చేరి తిరిగి గిరిజన ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు బస్సును ఐటీడీఏ వద్ద జెండా ఊపి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీడీ జాదవ్‌అంబాజి, ఏసీఎంఓ ఆత్రం జగన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

- మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఉట్నూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలపై కూడా ఉందని పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలను కాపాడుకోవాలనే లక్ష్యంతో పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార జాతా గురువారం ఉట్నూర్‌కు చేరుకున్న సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో ప్రభుత్వ విద్యారంగానికి తీవ్రనష్టం వాటిల్లుతోందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులు భరించలేని నిరుపేద తల్లిదండ్రులు మరింత పేదరికంలోకి జారి పోతున్నారన్నారు. కార్యక్రమంలో పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాదేశాం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లాకార్యదర్శి కె.శ్రీనివాస్, ఉట్నూర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆత్రంజంగు, చవాన్ రవీందర్, ఆడే ప్రకాష్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఘనంగా మహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపన

తలమడుగు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో శ్రీమహాలక్ష్మి దేవి నూతన ఆలయాన్ని నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి హోమం యజ్ఞంతోపాటు జలాధివాసం, కలిశ స్థాపన, పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, తదితర కార్యక్రమాలను వేదపండితులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు గ్రామస్థులు మాట్లాడుతూ ఐక్యలతో శ్రీమహాలక్ష్మి దేవాలయం నిర్మించుకొని అమ్మవారి విగ్రహంతో పాటు పోత రాజు విగ్రహాన్ని ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గడుగు శ్రీనివాస్, మేరుగు మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాపూరావు, బరకం మల్లేష్, మాజీ జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, నరేష్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.